క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

మహిళా కళాశాలలో 'కెరీర్ గ్రోత్'పై శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు కెరీర్ గ్రోత్‌పై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణ పద్మ, కామర్స్ అధ్యాపకురాలు డాక్టర్ నాగశాంతి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎం. జగదీష్, జేకేసీ మెంటార్ డి. ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : డీఎంహెచ్‌వో కార్యాలయంలో గత 3 రోజుల నుంచి జిల్లా ట్రైనింగ్ టీం ఆధ్వర్యంలో జరుగుతున్న దక్షత శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా 10 మంది పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్స్‌లకు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేటట్లు ప్రోత్సహించాలన్నారు. మాతా శిశువు మరణాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గర్భిణి పేరును 12 వారాల లోపు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, డాక్టర్ షర్మిల, ఐ.మనోరమ, కె.ధర్మేంద్ర, నాగభూషణం, స్టాఫ్ నర్స్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మూల్యాంకనం విధుల్లో ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమండి పైడిరాజు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి గురువారం డీఈవో ఎల్.చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా మూల్యాంకనం కేంద్రంలో తగిన మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం విధులను కేటాయించవద్దని, ఈ విషయంలో వారి అభ్యర్థనను పరిశీలించాలని కోరారు. దీనిపై డీఈవో సానుకూలంగా స్పందించారని పైడిరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేముడు బాబు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.



మీ దీవెనలే శ్రీరామరక్ష : వృద్ధ మహిళల ఆశీస్సులు తీసుకుంటున్న దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



ప్రియ నేతకు విజయ హారతి : ప్రసాద్‌గార్డెన్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వాసుపల్లికి హారతి ఇస్తున్న మహిళలు



ఆత్మీయ పరామర్శ : పండావీధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్తను పరామర్శిస్తున్న వాసుపల్లి



మీ కష్టంలో తోడుంటా : టిఫిన్ బండి వద్ద దోసెలు వేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజల సేవకుడిని నేను

ప్రజాదర్బార్ పేరిట అనునిత్యం ప్రజల్లో ఉండి వారి కష్టంలో తానున్నానంటూ ఆదుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ 35వ వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు. గురువారం35వ వార్డులో ఆయన రెండో రోజు ఎన్నికల ప్రచారం కొనసాగిస్తూ ప్రజలను కలుసుకున్నారు. అందరితో ఆప్యాయంగా మాట్లాడారు. వృద్ధులకు పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. నియోజకవర్గంలో తనను గెలిపించడం ద్వారా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని.. సంక్షేమ పాలనకు మద్దతు పలుకుదామని తెలిపారు. ఆయనకు అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు.

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- ప్రజలు, కార్యకర్తల బాగోగులపై ఆరా
- అడుగడుగునా హారతులు పట్టిన స్థానిక మహిళలు

జగదాంబ : తనను ఆదరించిన దక్షిణ నియోజకవర్గం ప్రజలకు తానెప్పుడూ సేవకుడిగానే ఉంటానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం జీవీఎంసీ 35వ వార్డులో రెండవ రోజు ఎన్నికల ప్రచారం కొనసాగించారు. వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి, ఆదివిష్ణురెడ్డి, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు. బౌడారా రోడ్డు నుంచి ప్రారంభమైన రోడ్‌షో ప్రసాద్‌గార్డెన్స్, చినదుర్గాలమ్మ వీధి, పండావీధి, నూనెమిల్లు వీధి, మంచాలవీధి, వెలంపేట, లక్ష్మీనగర్, పందుపుల్లల సందు, పూర్ణామార్కెట్ మేదర వీధి, స్ప్రింగ్ రోడ్డు, కల్లుపాకలు, గాజులవీధి వరకు నిర్వహించారు. ప్రచారంలో ప్రజలు అడుగడుగున పూలదండలు, హారతులు పడుతూ వాసుపల్లి పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎక్కడికక్కడ శాలువాలు కప్పి ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి వృద్ధ మహిళలకు పాదాభివందనం చేశారు. రోడ్డు పక్క హోటల్లో దోసెలు వేశారు. కూరగాయల దుకాణంలో కూరలు విక్రయించారు. తనపై ప్రజలు చూపిస్తున్న ప్రేమకు తానెప్పుడూ కృతజ్ఞతగా ఉంటానన్నారు. వారి సేవలోనే తనకు సంతోషం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందుతున్నాయని అన్నారు. సుపరిపాలన అందిస్తున్న జగనన్న 20 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉంటారని తెలిపారు. టీడీపీ హయాంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ, మత్స్యకారులను చంద్రబాబు కించపరిచారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక అందరినీ అక్కున చేర్చుకున్నారని.. అన్ని వర్గాల సంక్షేమం కోసం వివిధ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. రూ. లక్షా యాభై వేల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందించి పేదలకు బతుకు పట్ల భరోసా కల్పించారన్నారు. పేదల కోసం ఏం చేయడానికైనా జగనన్న వెనుకాడరని తెలిపారు. ప్రజాశీస్సులు మెండుగా ఉన్న దక్షిణలో తన గెలుపును జగనన్నకు కానుకగా ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : మాతాశిశు మరణాలు నిరోధించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల వ్యవధిలో జిల్లాలో ఆరు మాతృ మరణాలు సంభవించాయన్నారు. లంకెలపాలెంలో రెండు, బక్కన్నపాలెం, ఏకేసీ కాలనీ, కణితి, శ్రామికనగర్ ప్రాంతాల్లో ఒక్కొక్క మరణం సంభవించాయన్నారు. ఈ విషయమై సంబంధిత వైద్యులు, ఏఎన్‌ఎంల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదన్నారు. ఏఎన్‌ఎంలు గర్భిణుల పేర్లు నమోదు చేసుకున్న నాటి నుంచి వారికి తగిన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ ఆస్పత్రుల అధికారి డాక్టర్ రమేష్‌కిషోర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీవో జయదేవి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, కేజీహెచ్ ఎనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ జీవీ గణేష్, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ వీవీ శ్రీనివాసరెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ పి.ఉష, అగనంపూడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, పలు విభాగాల అధిపతులు ఐ.మనోరమ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లికి అభినందనలు

అల్లిపురం : వెంకటేశ్వరమెట్ట సర్వే నంబర్ 1450 సమస్య పరిష్కారానికి విశేష కృషి చేసిన వాసుపల్లి గణేష్‌కుమార్‌ను శ్రీ వెంకటేశ్వర మెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వెంకటేశ్వరమెట్టపై గల ఎండోమెంట్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 7.32 ఎకరాల భూమిని కేటాయించేలా కృషి చేయడమే కాకుండా, ఆ ప్రతిపాదనలను దేవదాయ శాఖకు పంపి, మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణల సహకారంతో సమస్య పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్‌కు శ్రీ వెంకటేశ్వరమెట్ట హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు అండగా ఉంటారని భీశెట్టి శ్రీనివాసరావు, శరగడం మోహన్‌రావు, పాలమరిశెట్టి శ్యామ్ తదితరులు తెలిపారు.

ఎన్నికల నియమావళి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

విశాఖ సిటీ: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందాలను నియమించారు. ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై ఎంసీసీ బృందాలు విచారణ చేపట్టి నివేదికను సమర్పించనున్నాయి. ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశారు.

దక్షిణ నియోజకవర్గం

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు

టీమ్-1	పి.వి.వి.డి.ప్రసాదరావు	జోన్-4 జోనల్ కమిషనర్	9848889701
	జి.మాణిక్యం	ఏఎస్‌ఐ	9618316235
టీమ్-2	వై.పున్నయ్య	జోన్-4 టౌన్ సర్వేయర్	9000945747
	జి.రాము	హెచ్‌సీ	9912508285
టీమ్-3	కె.సన్యాసప్పడు	జోన్-4 సూపరింటెండెంట్	8500374413
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు			
టీమ్-1	డి.మురళి	ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్	9491808388
	ఎ.సింహాచలం	హార్బర్ డీఎస్‌ఐ	9618316235
టీమ్-2	ఎస్.సుర్యప్రభ	అసిస్టెంట్ రిజిస్ట్రార్	8374468743
	జి.అప్పలనాయుడు	టూటౌన్ హెచ్‌సీ	9494184854
టీమ్-3	యు.హరినాథ్‌బాబు	అసిస్టెంట్ రిజిస్ట్రార్	9121735600
	కె.చిట్టన్న	మహారాణిపేట ఏఎస్‌ఐ	9701221089

ముగిసిన అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో కొలువైన రేణుక ఎల్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి రమణమూర్తి, ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కోశాధికారి డి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగం శ్రీనివాస్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, రంధి గోపీకృష్ణ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 4 వేల మంది పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో పరిశుద్ధ గురువారం



సంఘం సభ్యుల కాళ్లు కడుగుతున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్

కంచరపాలెం : తనను చంపడానికి కుట్ర పన్నిన యూదులు, రోమీయులకు క్రీస్తు తనను తాను అప్పగించబడే చివరి రాత్రి భోజన దినంగా పరిశుద్ధ గురువారాన్ని పేర్కొంటారని రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కేథడ్రల్‌లో గురువారం రాత్రి పరిశుద్ధ గురువారం పవిత్ర సాంగత్యం నిర్వహించారు. తనను తాను తగ్గించుకున్న వాడు హెచ్చించబడతాడని ఏసు చెప్పారన్నారు. ఆయనలాగే మనం కూడా చేయాలని క్రీస్తు తన శిష్యుల కాళ్లు కడిగారని తెలిపారు. క్రీస్తును అనుసరిస్తూ సంఘంలో 12 మంది కాళ్లను జలంతో కడిగారు. కార్యక్రమంలో సహాయ విచారణకర్తలు ఫాదర్ వేళంగిణిరాజు, ఫాదర్ ప్రభాకర్, పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్ బాబు, పాలమరిశెట్టి ఫ్రాన్సిస్, మీసాల స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు

జోన్-4లో రూ. 75 లక్షల పన్ను వసూలు



రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో పన్ను వసూలు చేస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : ప్రజలు త్వరితగతిన పన్నులు చెల్లించాలని జీవీఎంసీ జోన్-4 జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. గురువారం జోన్ పరిధిలో రూ. 75 లక్షల పన్ను వసూలు చేసిన ఆయన మాట్లాడుతూ బకాయిలను ఎటువంటి వడ్డీ లేకుండా పూర్తిగా చెల్లించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, సెక్రటరీలు 12 వార్డుల్లో బకాయిలు వసూలు చేస్తున్నారన్నారు. మొండి బకాయిదారులకు ముందుగా జప్తు నోటీసులు ఇవ్వాలన్నారు. అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తులు జప్తు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. చెక్కులు తీసుకోవద్దని సిబ్బందికి తెలిపారు. నేరుగా కమిషనర్, జీవీఎంసీ పేరుతో డీడీలు తీసుకోవాలన్నారు. గతంలో చెక్కులు ఇచ్చి పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే ధ్యేయం



ఎల్లాజీని అభినందిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ నాయకులు

దాబాగార్డెన్స్ : సమసమాజ స్థాపన, రాజ్యాంగ పరిరక్షణకు ఏర్పడిందే సమాజ్‌వాదీ పార్టీ అని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ జాలాది విజయ పేర్కొన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆ పార్టీ అభ్యర్థులను ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 175 స్థానాలకు సమాజ్‌వాదీ పార్టీ పోటీ చేస్తుందన్నారు. తమ పార్టీ జాతీయ గుర్తు సైకిల్ అని, రాష్ట్రంలో సైకిల్ పంపు తమ గుర్తుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య, కల్యాణి యాదవ్, ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి సూరాడ ఎల్లాజీ, అనకాపల్లి అభ్యర్థి ఒమ్మి వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

దక్షిణ నుంచి హిజ్రా ఎల్లాజీ పోటీ..

దక్షిణ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున హిజ్రా సూరాడ ఎల్లాజీ పోటీ చేస్తున్నారు. ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి, పార్లమెంట్ అభ్యర్థి జాలాది విజయ, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వరరావు గురువారం ఈ విషయం ప్రకటించారు. ఎల్లాజీ మాట్లాడుతూ ఇంత వరకు ఏ రాజకీయ పార్టీ హిజ్రాలకు టికెట్ ఇవ్వలేదన్నారు. పలువురు హిజ్రాలు ఎల్లాజీకి అభినందనలు తెలిపారు.

గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌కు ముస్తాబు



గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా సర్వాంగ సుందరంగా వాల్తేర్ సెమెట్రీ సమాధులు



జగదాంబ జంక్షన్‌లోని రెజిమెంటల్ సెమెట్రీలో గల 250 ఏళ్ల కిందటి సమాధులు

దాబాగార్డెన్స్ : క్రీస్తు పునరుత్థాన పండగను పురస్కరించుకుని ఈ నెల 31న వాల్తేర్ సెమెట్రీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నగర నడిబొడ్డున ఉన్న వాల్తేర్ సెమెట్రీ, జగదాంబ జంక్షన్‌లో గల రెజిమెంటల్ సెమెట్రీని అందంగా తీర్చిదిద్దారు.

రెజిమెంటల్ సెమెట్రీలో చెత్త తొలగింపు

నగర నడిబొడ్డున జగదాంబ జంక్షన్‌లో గల రెజిమెంటల్ సెమెట్రీలో టన్నుల కొద్దీ పేరుకుపోయిన చెత్తా చెదారాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ఈ సమాధులు రెండు శతాబ్దాల కిందటివి.

ఘనంగా ఉక్కు భద్రతా దినోత్సవం



భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న జేసీఐఎఫ్ శివశంకరరెడ్డి, సీజీఎం సోఢీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జాతీయ ఉక్కు భద్రతా దినోత్సవం (స్టీల్ సేఫ్టీ డే)ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన వేడుకలను రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర రెడ్డి, స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఢీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆహూతులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శివశంకరరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భద్రతతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాద రహిత పరిశ్రమగా స్టీల్‌ప్లాంట్‌ను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎం ప్రవీణ్ కుమార్, భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్‌తో, పలువురు జీఎంలు, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ జాతర

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామ ఇలవేల్పు మరిడిమాంబ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. నిర్వాసిత కాలనీల భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించారు.

ఉత్కంఠభరితంగా 'దెయ్యం చెప్పిన సాక్ష్యం'

దాబాగార్డెన్స్ : దెయ్యం చెప్పిన సాక్ష్యం పేరిట సొంతంగా చలన చిత్రం రూపొందిస్తున్నట్లు డబ్బింగ్ స్టార్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చిత్రానికి డైరెక్షన్, సంగీత దర్శకత్వం స్వయంగా తానే అందిస్తూ కథానాయకుడిగా కూడా నటిస్తున్నట్లు తెలిపారు. కొత్తదనం నిండిన ఈ చిత్రం చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగుతుందన్నారు. హిందీ, తమిళం, కన్నడ, భోజ్‌పురి భాషల్లో చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. సమావేశంలో నిర్మాత, ఎంఎంఎం క్రియేషన్స్ అధినేత ఎస్ఆర్‌వీకే రాజు, పీలా ప్రొడక్షన్స్ అధినేత పీఎస్ తిలక్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న తిరువీధి

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా గురువారం సాయంత్రం అప్పన్నకు సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవిలను శోభాయమానంగా ముస్తాబు చేసి సర్వజన మనోరంజనిపై వేంజేపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధిల్లో నిర్వహించిన తిరువీధి నేత్రపర్వంగా సాగింది. స్వామికి ఘనంగా హారతి సమర్పించారు. సింహగిరి మాడ వీధులు జనసంద్రంగా మారాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పెద్ద రాజు, రుత్వికులు, పారాయణదారులు నిర్వహించారు.

మాతృమూర్తి సేవా పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న అతిథులు జి.ఎస్.ఎన్.రాజు, బాలమోహన్‌దాస్

సీతంపేట: మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ మేడా మస్తాన్‌రావు ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పలువురికి మాతృమూర్తి సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ వి.చిట్టిబాబు, మా సంస్కృతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు లక్ష్మీ భార్గవి చేతుల మీదుగా పురస్కారాలను అందించారు. తల్లిని కంటికి రెప్పలా, ప్రేమగా చూసుకుంటున్న కొడుకులు, కూతుళ్లు ఐదుగురిని పురస్కారాలకు ట్రస్టు ఎంపిక చేసింది. కళ్లేపల్లి జగదీశ్వరరావు, కొణతం సేతు మాధవరావు, అనంతశెట్టి జనార్ధనరావు, వప్పంగి అప్పలరాజు, గోగినేని రాధికలను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత వేముల భాస్కరాచారి, విశ్రాంత లేబర్ కమిషనర్ డి.ఆర్.కె.రావు, ట్రస్టు ఉపాధ్యక్షులు మేడా పద్మావతి, సభ్యులు మేడా శివారెడ్డి, మేడా భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.